క్లుప్తంగా

కండలేరులో 10.527 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 10.527 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 380 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్రిడ్జిల ప్రారంభోత్సవం.. ప్రసారం వీక్షణకు ఏర్పాట్లు


డీవీ సత్రంలో సబ్‌వే బ్రిడ్జి వద్ద స్థలం చదును చేస్తున్న జేసీబీ

దొరవారిసత్రం: చెన్నై డివిజన్ పరిధిలో ఇటీవల నిర్మించిన 17 సబ్‌వే బ్రిడ్జిల ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం వీక్షణకు రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సబ్‌వే బ్రిడ్జిలను ఈనెల 26వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో దొరవారిసత్రం మండలంలోని పోలిరెడ్డిపాళెం, నేతాజీనగర్, డీవీ సత్రం గ్రా మాల సమీపంలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద నిర్మించిన సబ్‌వే బ్రిడ్జిల ప్రారంభోత్సవాన్ని ఆయా ప్రాంతాల్లోని ప్రజలు, పాఠశాల విద్యార్థులు వీక్షించేలా రైల్వే అధికారులు చర్యలు చేపడుతున్నారు.

29న మండల మీట్

గూడూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీపీ బూదూరు గురవయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ కె.రామచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అన్ని శాఖలతో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి కో-ఆప్షన్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఎన్ఎస్సార్ సేవలు చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు

కోట: మాజీ మంత్రి, స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆర్యవైశ్యసంఘం నేత నందగోపాల్ కొనియాడారు. శుక్రవారం కోటలో శ్రీనివాసులురెడ్డి వర్ధంతి జరుపుకున్నారు. కోట బజారువీధిలో ఉన్న శ్రీనివాసులురెడ్డి విగ్రహానికి ఆయన అభిమానులు, రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకుడు నందగోపాల్ మాట్లాడుతూ కోట అభివృద్ధికి శ్రీనివాసులురెడ్డి చేసిన కృషి మరిచిపోలేనిదన్నారు. నెల్లూరు జిల్లా రాజకీయాలను శాసించిన శ్రీనివాసులురెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శుక్రవారం ట్రిపుల్‌ఈ విభాగం ఆధ్వర్యంలో ఇన్స్‌ఫిరాన్-2024 సాంకేతిక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్రంలోని 12 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 85 మంది విద్యార్థులు హాజరై తమ ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పేపర్ ప్రజెంటేషన్ విభాగాల్లో విద్యార్థులు తమ నైపుణ్యం ప్రదర్శించారు. ఉత్తమ ప్రజెంటేషన్‌కు బహుమతి, ప్రశంసాపత్రాన్ని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సాంకేతిక సదస్సుల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీ సురేష్‌రెడ్డి, ప్రోగ్రామ్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శని జయంతి వేడుకలు


శని భగవానుడికి పూజలు చేస్తున్న అర్చకులు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో శని భగవానుని జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో గణపతిపూజ, అష్టోత్తర శత కలశపూజ, శనైశ్వరస్వామి మూల మంత్రహోమం, అష్టోత్తర శత కలశాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం జేష్టాదేవి సమేత శనీశ్వరస్వామి కల్యాణ మహోత్సవంగా వైభవంగా చేశారు.

రుణ లక్ష్యాలు సాధించండి


సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్

వెంకటగిరి రూరల్: బ్యాంకర్లు తమ రుణ లక్ష్యాలను సకాలంలో సాధించాలని లీడ్‌బ్యాంకు మేనేజర్ సుభాష్ పేర్కొన్నారు. పట్టణంలోని స్త్రీశక్తి భవనంలో శుక్రవారం బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా ప్రత్యేక పథకాలతో సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వాటిపై ఖాదాదారులకు అవగాహన కల్పించి, రుణాల మంజూరుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అలాగే రుణాల రికవరీ లక్ష్యాన్ని కూడా సాధించాలని ఆదేశించారు. పీఎంజీపీ, క్రెడిట్ కిసాన్, ముద్రలోన్స్, జగనన్న తోడు, టిడ్కో గృహాలకు సంబంధించి రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోసుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. డీఏడీపీ ఏపీఎం సుధారెడ్డి, బ్యాంకర్లు వెంకటరమణ, బాబా, ఏఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

రుణాల మంజూరులో అలసత్వం వద్దు

గూడూరురూరల్: బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరులో అలసత్వం వద్దని లీడ్ బ్యాంకు మేనేజర్ ఆర్ సుభాష్ సూచించారు. గూడూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జాయింట్ మండల స్థాయి బ్యాంకర్స్ కమిటీ(జేఎంఎల్‌బీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత సాధించే క్రమంలో గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక ఇబ్బందులు తొలగించేలా ప్రభుత్వం పలు పథకాలను తీసుకుని వస్తుందని, వీటికి బ్యాంకు లింకేజీ ఉన్నందున వాటిని త్వరగా అందించేలా చూడాలని అన్నారు. అనంతరం పొదుపు గ్రూపు సభ్యులకు రుణాలు, అలాగే జగనన్న తోడు, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎమ్ఈ, టిడ్కో గృహాల రుణాలు, ఎంఎస్ఎంఈ స్టాండప్ ఇండియా, ముద్ర, విద్యా రుణాలపై సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో డీఆర్‌డీఏ, మెప్మా, డీపీఎంలు, సుబ్బారెడ్డి, బాబా, రమణ,ఏరియా కోఆర్డినేటర్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నేతలకు మాజీ మంత్రి ఆత్మీయ పలకరింపు


జయంపులో మధుసూదన్‌రెడ్డితో మాట్లాడుతున్న మాజీ మంత్రి రాజ్యలక్ష్మి

దక్కిలి(బాలాయపల్లె): మండలంలోని జయంపు గ్రామానికి చెందిన వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ వీ మధుసూదన్‌రెడ్డి, పల్లిపాడుకు చెందిన సీనియర్ నాయకుడు రవీంద్రరెడ్డి కుటుంబ సభ్యులను శుక్రవారం మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి ఆత్మీయంగా పలకరించారు. నేదురుమల్లి కుటుంబంతో విడతీయరాని అనుబంధం కలిగిన వీ మధుసూదన్‌రెడ్డి, రవీంద్రరెడ్డి యోగక్షేమాలను నేదురుమల్లి రాజ్యలక్ష్మి అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వీ కార్తీక్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్

ఓజిలి: మండలంలోని అత్తివరం ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ చంద్రశేఖర్ శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు చేసిన వంటను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం తయారు చేసి పెట్టాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పోషకాలతో కూడిన పౌష్టికాహారం అందిస్తుందన్నారు. అలాగే అదనపు గదుల నిర్మాణం కోసం పాఠశాల ఆవరణలో తీసిన గుంతలు ప్రమాదకరంగా మారడంతో పరిశీలించి, గుంతలను జేసీబీ సాయంతో పూడ్చివేశారు.

తాగునీటి ఎద్దడి నివారించాలి


వాటర్ స్కీమ్‌ను పరిశీలిస్తున్న సీఈఓ

వాకాడు: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని ఎక్కడ తాగునీటి ఎద్దడి నెలకొనకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నెల్లూరు జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన వాకాడు స్వర్ణముఖి బ్యారేజ్ సమీపంలో ఉన్న సీపీడబ్ల్యూ స్కీమ్, వాకాడు బీసీ కాలనీ రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాకాడు, కోట, చిట్టమూరు, మండలాల్లో ప్రతి ఒక్కరికి తాగునీరు అందించే దిశగా వాటర్ స్కీములను సిద్ధం చేయాలన్నారు. అలాగే కొన్ని చోట్ల వాటర్ స్కీమ్‌లు పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయని మండిపడ్డారు. వాటిని వెంటనే తొలగించి మరమ్మతులు చేయించాలన్నారు. ప్రతి స్కీమ్ వద్ద మొక్కలు నాటి, అందంగా ఉండేలా చూడాలన్నారు. వాటర్ స్కీమ్‌ల వద్ద ఉన్న సిబ్బందికి అవసరమైన వసతి ఏర్పాటు చేయాలన్నారు. తీర ప్రాంత గ్రామాలకు వెళ్లే వాటర్ స్కీమ్‌ల మోటార్లు కొన్ని పాడైపోయినట్లు తన దృష్టి రావడం జరిగిందన్నారు. వెంటనే వాటిని బాగు చేయించి తాగునీటి సరఫరా కొనసాగించాలన్నారు. దీనిపై సీపీడబ్ల్యూ స్కీమ్‌ల కాంట్రాక్టర్లు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈయన వెంట ఎంపీడీఓ తోట గోపీనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకుమార్, ఏఈ సురేష్, సిబ్బంది ఉన్నారు.

ప్రజా సంఘాల ఆందోళన

గూడూరురూరల్: రైతులపై బీజేపీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా దేశవ్యాప్తంగా జరిగే నిరసనలో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం గూడూరులోని టవర్‌క్లాక్ సెంటర్‌లో రైతు సంఘం, ప్రజా సంఘాల నేతలు ఆందోళన చేశారు. రైతు సంఘం గూడూరు డివిజన్ నాయకుడు జోగి శివకుమార్ మాట్లాడుతూ పంజాబ్‌లో జరిగిన పోలీసు కాల్పుల్లో యువ రైతు చనిపోవడం, మరో రైతు గుండెపోటుతో మరణించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు బీవీ రమణయ్య, కార్యదర్శి సురేష్, టి.వెంకట్రామిరెడ్డి, కేవీపీఎస్ నాయకులు ఏ ప్రసాద్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు రమేష్, డీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం పెంపునకే కబడ్డీ పోటీలు



క్రీడాకారులతో జిందాల్ పరిశ్రమ ప్రతినిధులు

చిల్లకూరు: క్రీడాకారుల్లో నైపుణాలను వెలికి తీసేందుకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిందాల్ పవర్ లిమిటెడ్ ప్రతినిధులు తెలిపారు. మండలంలోని గమ్మళ్లదిబ్బలో శుక్రవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమ హెచ్‌ఓపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ్మినపట్నం పంచాయతీలోని క్రీడాకారులకు రెండు రోజులు పాటు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, సెట్విన్ పర్యవేక్షణలో కోట, వాకాడు, చిల్లకూరు మండలాల నుంచి 17 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తున్నామన్నారు. అనంతరం పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్ఎస్ఏ మన్సూరీ, హెచ్ఓ సపోర్టు సరోజ్‌పాదీ, విల్సన్, మాథ్యూ, శ్రీకాంత్, పూనా, సర్పంచ్ ఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై దాడులు


పేకాట రాయుళ్లను అరెస్టు చేస్తున్న ఎస్ఈబీ అధికారులు

వాకాడు: కోట, వాకాడు మండలాల్లో శనివారం ఎస్ఈబీ అధికారులు బెల్టు దుకాణాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో కోట మండలం ఊనుగుంట పాళెంలో బెల్టు దుకాణం అక్రమంగా నిర్వహిస్తున్న మట్టిగుంట వెంకటసుబ్బయ్యను అదుపులోకి తీసుకుని అతడి నుంచి 10 క్వార్టర్ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. అలాగే వాకాడు మండలంలో సిద్దిగుంటపాళెం సమీపంలోని రొయ్యల గుంటల వద్ద పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని సీఐ చెప్పారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, రూ.7 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అమృత్ సరోవర్‌తో భూగర్భ జలాల పెంపు


పనులు పరిశీలిస్తున్న ఏపీఓ గిరిబాబు

చిల్లకూరు: ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న అమృత్ సరోవర్‌తో భూగర్భ జలాలు పెంపొందుతాయని ఏపీఓ గిరిబాబు తెలిపారు. మండలంలోని పొన్నవోలు పంచాయతీలో జరుగుతున్న అమృత్ సరోవర్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని కూలీలకు పనులు కల్పించడంతో పాటుగా వర్షాలు వచ్చిన సమయంలో భూగర్భజలాలు వృద్ధి చేందేందుకు అమృత్ సరోవర్ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. మండలానికి 33 పనులు మంజూరు చేశారని, అందులో 10 ప్రారంభమయ్యాయని చెప్పారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నాయుడుపేటకు చెందిన బత్తల చెంగయ్య, చెంగమ్మ దంపతులు రూ.1,00,116 నగదు విరాళం ఇచ్చారు. శుక్రవారం ఆ మొత్తాన్ని ఆలయ ఏసీ డబ్బుగుంట వెంకటేశ్వర్లుకు అందజేశారు. అమ్మవారికి మొక్కుబడి ఉండడంతో ఈ చిరుసాయం అందజేశామని దాతలు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నాయుడుపేటటౌన్: మాఘపౌర్ణమి సందర్భంగా పట్టణంతోపాటు మండలంలోని పలు ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని వ్యూహలక్ష్మి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివార్లకు క్షీరాభిషేకం, కుంకుమ, చందన అభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి, పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్ కృష్ణశర్మతోపాటు దాతలు పాల్గొన్నారు. అలాగే తిమ్మాజీ కండ్రిగ స్వర్ణముఖినది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వరిదేవి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి, పూజలు చేశారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న బాబూ నెహ్రూరెడ్డి

గూడూరురూరల్: గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే, సంబంధిత వైద్యులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా విస్తరణ మీడియా అధికారి బాబూ నెహ్రూరెడ్డి సూచించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం డివిజన్‌లోని చిన్న పిల్లలు, గర్భకోశ వైద్యులు, పోలీసులతో సబ్ డివిజనల్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎక్కడా స్కానింగ్ చేసి, లింగనిర్ధారణ జరిగినట్లు సమాచారం వస్తే వారిపై పీసీ, పీఎన్డీటీ యాక్ట్ ప్రకారం చర్యలు తప్పవన్నారు. భ్రూణ హత్యలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని సూచించారు. బాల్య వివాహాల నియంత్రణకు అన్నిశాఖల వారు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాల్లో పని చేసే మహిళా పోలీసులు బాల్య వివాహాలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్ఓ మస్తానమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి పంట కోత ప్రయోగాలు

చిల్లకూరు: రబీలో సాగు చేసిన వరి పంట దిగుబడిని లెక్కింపునకు కోత ప్రయోగాలు చేపడుతున్నట్లు ఏఓ గూడూరు భవాని తెలిపారు. మండలంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలో సుమారు 7 వేల ఎకరాల మేరకు వరి సాగు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. ఈ క్రమంలోనే శనివారం నుంచి మండలంలోని ప్రతి గ్రామంలోని ఐదు ప్రాంతాల్లో పంట కోత ప్రయోగాలు చేపడుతున్నామన్నారు. మండలంలోని అందరూ వ్యవసాయ సహాయకులు ప్రతి గ్రామంలో పంట కోత ప్రయోగాలను చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఆమె ఆదేశించారు. ఆమె వెంట వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

పుష్పయాగానికి అంకురార్పణ


అంకురార్పణకు పూజలు చేస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి పుష్పయాగానికి అంకురార్పణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో ప్రత్యేకహోమాలు, పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి మాట్లాడుతూ మాఘ పౌర్ణమి రోజున స్వామివారికి పుష్పయాగం చేయడం ఆనవాయితీ అన్నారు. పుష్పయాగం విజయవంతం అయ్యేందుకు వేదపండితులు నందన వనంలోని పుట్టమట్టిని తీసుకువచ్చి అందులో నవధాన్యాలు కలపి ప్రత్యేకపూజలు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం అనుజ్ఞ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మత్సంగ్రహణం, అంకురార్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అంకురార్పణ కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోతురచ్చను ప్రారంభించిన నేదురుమల్లి


రచ్చను ప్రారంభిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

దక్కిలి: మండలంలోని మాటుమడుగులో గడ్డం సంజీవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి సుగుణమ్మ, కుమారుడు అశోక్‌రెడ్డి నిర్మించిన పోతురచ్చను వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. తొలుత మాటుమడుగుకు విచ్చేసిన రామ్‌కుమార్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో అందరినీ పేరు పేరునా ఆప్యాయంగా పలకరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు తాము అండగా ఉంటామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి జగన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, డీ జనార్దన్‌రెడ్డి, పి దశరథరామిరెడ్డి, వేణునాయుడు, కె వేణుగోపాల్, మల్లికార్జున్‌రెడ్డి, కోటి రెడ్డి, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లి దాతృత్వం


విరాళం అందజేస్తున్న కౌన్సిలర్ సుబ్బారావు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని బంగారుపేట దళితవాడకు చెందిన కే వెంకటరమణయ్య(38) ఆరోగ్య పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఈ విషయం తెలుసుకుని వెంకటరమణయ్య అంత్యక్రియలకు తన సొంత నిధులు రూ.10 వేలు విరాళం ఇచ్చి, తన దాతృత్వం చాటుకున్నారు. ఆ వార్డు కౌన్సిలర్ పీ సుబ్బారావు ఈ మొత్తాన్ని వెంకటరణయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు వలికల కృష్ణయ్య, మేకల శ్రీనివాసులు, నాగరాజు, రవి, ప్రసన్న పాల్గొన్నారు.

మట్టి నమూనాలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థులకు జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వ్యవసాయశాఖ అధికారి డాక్టర్ రామాంజనేయులు శుక్రవారం మట్టి నమూనాలపై అవగాహన కల్పించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఆత్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. భూమి సారవంతం, పంటల సస్యరక్షణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భూమి స్వభావం ఆధారంగా ఏఏ పంటలు సాగు చేసుకోవచ్చన్న విషయం తెలుసుకోవాలని సూచించారు. అనంతరం మట్టి నమూనా విశ్లేషణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నాగార్జున సాగర్, కేవీకే శాస్త్రవేత్తలు రాజీవన, డీఆర్‌సీ వేణుగోపాల్, ఏఓ సుజాత, పాఠశాల ప్రిన్సిపల్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను కమిషనర్ జనార్దన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. మున్సిపాలిటీలోని 37 పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ బూత్ నంబర్, బీఎల్వో, సెక్టార్ అధికారి, ఎస్‌హెచ్ఓ, కమిషనర్ సెల్‌ఫోన్ నంబర్లు సైతం ప్రతి ఒక్కరికీ కనిపించేలా బోర్డులను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికలకు సంబంధించి అధికారులు చెప్పి సూచనలు పాటిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దీన్, బిల్ కలెక్టర్ రమేష్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం


మాట్లాడుతున్న ఏఓ

సైదాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష రోగుల పాలిట వరమని ఏఓ పురుషోత్తం శివకుమార్ అన్నారు. సైదాపురం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ శారద అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను కూడా ఉచితంగా అందజేస్తుందని చెప్పారు. అలాగే కంటి పరీక్షలు చేసి, ఉచితంగా కళ్లద్దాలు కూడా అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పద్మ, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ జనార్దన్, డాక్టర్ శ్రావణి, కార్యదర్శి శశి ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.